# కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలు నమ్మరు

**గుండుమాల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి**

**ఈ నెల 9న పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్**



సమావేశంలో మట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

కోస్గి, అక్టోబర్ 31 : రాష్ట్రంలో ఉన్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోగారం గ్రామంలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలను ప్రజలు నమ్మే పరిస్థితులో లేరన్నారు. రెండోసారి పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమన్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశారన్నారు. 10 గ్రామాల నాయకులు కలిసికట్టుగా పనిచేసి అధిక మెజార్టీతో పట్నం నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో 90 సీట్ల వరకు బీఆర్‌ఎస్ పార్టీ గెలిచి కేసీఆర్ సీఎం అవుతారన్నారు. కొడంగల్‌లో కాంగ్రెస్ గెలిచేందుకు బలవంతంగా కాంగ్రెస్ నాయకులు గుర్నాథ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి పార్టీ కండువాలు కప్పుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనంతరం గుండుమాల్, బోగారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

# ప్రలోభాలకు గురిచేస్తే సహించేదిలేదు

**బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి**

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 31 : జిల్లాలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేస్తూ బలవంతంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల కండువాలను మార్చుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నదని మండిపడ్డారు. జిల్లాలో పలుచోట్ల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లకు వెళ్లి బలవంతంగా కాంగ్రెస్ పార్టీ కండువాలు వేస్తున్నారని.. ఇది సహించరాని చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయొచ్చుని.. కానీ తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలే తప్పా కండువాలు మార్చినంత మాత్రాన గెలువలేరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు పనిగట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లకు వెళ్లి ప్రలోభాలకు గురిచేస్తున్నారని.. పార్టీ మారేందుకు ఇష్టపడకపోతే బలవంతంగా కండువాలు కప్పి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాన్ని ఎంచుకున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా ఇబ్రహీంపట్నంతోపాటు జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. నియోజకవర్గంలో మూడుసార్లు ఓడిపోయిన అభ్యర్థి, నాలుగోసారి పోటీచేస్తూ తప్పుడు ప్రచారానికి దిగాడని, ఈ ఎన్నికల్లోనూ ఆ అభ్యర్థిని చిత్తుగా ఓడిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, పార్టీలో చేరాలంటూ ఇంటివద్దకు వచ్చేవారికి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే సూచించారు.

# కాలకూట విషంలాంటిది కాంగ్రెస్ పార్టీ

- **హత్యా రాజకీయాలు తగవు**
- **దుబ్బాక అభ్యర్థిపై కత్తి దాడి హేయం**
- **ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి**



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 31 : గత 10 సంవత్సరాలుగా శాంతియుత వాతావరణంలో పచ్చగా ఉన్న తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నదని.. ఇది సహించరానిదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. అభ్యర్థులపై దాడి చేయడం కాంగ్రెస్ పార్టీకి తగదన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విధానాలు చెప్పుకుని ఓట్లు అడగాలి కాని హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలి. దాడికి ప్రేరేపించినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. హత్యా రాజకీయాలు, దాడులను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు.

**నెత్తుటి రాజకీయాలు ఇకపై సాగవు**



తాండూరు : నీచ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్.. నెత్తుటి రాజకీయాలు ఇకపై సాగవని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేము అని తెలిపోవడంతో కాంగ్రెస్ పార్టీ తన వక్రబుద్ధిని మరోసారి బయటపెట్టిందన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస పార్టీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలు సిగ్గుచేటన్నారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను హత్య చేసే కాంగ్రెస్ ఆలోచనా విధానం గర్హనీయమన్నారు. ఈ తరహా నెత్తుటి రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో దాడులు జరుగుతున్నాయని ప్రజలకు అర్థమైందన్నారు. ఇలాంటి నీచ రాజకీయ పార్టీకి ప్రజలే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభాకర్‌రెడ్డిపై దాడిని రేవంత్‌రెడ్డి ఇంతవరకు ఖండించపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రభాకర్‌రెడ్డిపై దాడి సరైందికాదు**



కులకచర్ల : దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం సరికాదని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం సరికాదన్నారు. కాలకూట విషంలాంటి కాంగ్రెస్ పార్టీని కనుచూపు మేరలో కూడా లేకుండా కనుమరుగు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ కుతంత్రాన్ని, కుళ్లును, కుటిల రాజకీయాన్ని, హింసను అడుగడుగునా ప్రతిఘటించి శాంతియుత రాష్ట్రాన్ని పదిలపర్చుకోవాలన్నారు. రాజకీయంగా ఎదుర్కొనడానికి చేతకాని కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు.

# నిఘా మరింత పటిష్టం

- **స్ట్రాంగ్ రూమ్ వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు**
- **వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**



సెయింట్ మార్క్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తాండూరు, అక్టోబర్ 31 : సరిహద్దుల్లో అక్రమంగా తరలించే మద్యం, డ్రగ్స్, డబ్బు తరలించే వాహనాలను గుర్తించేలా, క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చెక్ పోస్ట్‌ల వద్ద నిఘా మరింత పటిష్టం చేశామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కరణ్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోత్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును ఎస్పీ కోటిరెడ్డితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు జిల్లా ఎన్నికల అధికారికి లింక్ చేయబడి ఉంటాయన్నారు. ఎన్నికల కమిషన్ అనునిత్యం సీసీ కెమెరాల రికార్డులను పరిశీలిస్తుందన్నారు. ఎలక్షన్లు పూర్తయ్యేవరకు నిర్విరామంగా వాహన తనిఖీలు చేయాలన్నారు. పోలీస్‌శాఖ, ఆబ్కారీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాండూరులోని సెయింట్ మార్క్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను వారు పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థను పరిశీలించారు. తాండూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న వివిధ విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ, పోలీస్, ఆబ్కారీ శాఖ అధికారులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# హరిత రిసార్ట్‌లో అన్ని వసతులు కల్పించాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

ధారూరు, అక్టోబర్ 31 : అనంతగిరి హరిత రిసార్ట్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం అనంతగిరి హరిత రిసార్ట్‌ను ఎస్పీ కోటిరెడ్డితో కలిసి సందర్శించారు. రిసార్ట్‌లో వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రానున్నారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు బస చేసేందుకు వీలుగా హరిత రిసార్ట్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. హరిత రిసార్ట్‌లో మెరుగైన మొబైల్ సిగ్నల్స్, వైఫై సౌకర్యం ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్, ఎస్పీల వెంట జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఎల్పీవో శంకర్‌నాయక్, డీఆర్డీవో అధికారులు స్టీవెన్‌నీల్, నర్సింహులు ఉన్నారు.

# ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్



ప్రతిజ్ఞ చేయిస్తున్న తాండూరు పట్టణ పాలీస్ స్టేషన్ ఆవరణలో పాలీస్ సిబ్బంది

తాండూరు, అక్టోబర్ 31 : ఉక్కు మనిషి, దేశ మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించుకునే జాతీయ ఐక్యతా దినోత్సవంలో భాగంగా మంగళవారం తాండూరు పట్టణ పాలీస్ స్టేషన్ ఆవరణలో కలెక్టర్ నారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీ కోటి రెడ్డి పోలీస్ సిబ్బంది, ప్రజలతో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి : 80966 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962

**చేగూరి అగ్రి కోల్డ్ స్టోరేజ్ పై ఎక్సైజ్ అధికారుల దాడులు**

# రూ.90,43,200 విలువ చేసే 22,608 కేజీల నల్లబెల్లం స్వాధీనం



రాందాస్‌పల్లిలో ఎక్సైజ్ అధికారుల దాడిలో స్వాధీనం చేసుకున్న నాటుసారాయికి వినియోగించే కాలం చెల్లిన నల్లబెల్లం

ఆదిబట్ల, అక్టోబర్ 31 : మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామంలో తీగ లాగితే ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో డొంక కదిలింది. అక్రమంగా నిల్వ ఉంచిన లక్షల విలువ చేసే నల్లబెల్లం ఎక్సైజ్ అధికారులకు చిక్కింది. ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం మంచాల మండలం చెన్నారెడ్డిగూడ గ్రామం నుంచి బోడకొండ కు వెళ్లే తారు రోడ్డు దారిలోని చెరువు కట్టపై ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన కాట్రోత్ మోత్యా తన బైక్‌పై 10 లీటర్ల నాటు సారాయిని తీసుకెళ్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు అతడిని విచారించి.. నాటు సారాయికి సంబంంచిన ముడిసరుకు బెల్లాన్ని ఎక్కడి నుంచి కొనుగోళ్లు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామంలో బెల్లం కొనుగోళ్లు చేస్తున్నామని పోలీసులకు తెలిపాడు. దీంతో మంగళవారం ఉదయం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లి గ్రామంలోని చేగూరి అగ్రి కోల్డ్ స్టోరేజ్‌పై ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. అందులో అక్రమంగా నిల్వ ఉంచిన నాటు సారాయికి వినియోగించే ముడి సరుకు కాలం చెల్లిన నల్లబెల్లాన్ని గమనించారు. రూ.90,43,200 విలువ చేసే 1256 కాటన్లలో 22,608 కిలోల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బెల్లాన్ని కేవలం నాటుసారాయి తయారీ చేసే విక్రయించేవారికి అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. దీంతో సంబంధమున్న నగరానికి చెందిన సాయిబాబా ట్రేడర్స్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ చంద్రయ్య, సరూర్‌నగర్ డీపీవో రవీందర్‌రావు, ఎస్‌టీఎఫ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఏఈఎస్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు, ఎక్సైజ్ ఎస్ఐలు యాదయ్య, సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.